



వంశధార నదిలో నీటిని తోడుకుంటున్న మహిళలు

పాతపట్నమే!



- వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం
- ఎన్నికల హామీలేవీ నెరవేరని వైనం
- గిరిజన గ్రామాల్లో అధ్వాన రహదారులు
- సమస్యలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు





జగన్‌కు చీపురుపల్లి నిర్వాసితుల సమస్యను వివరిస్తున్న గిరిజన సంఘాలు (ఫైల్)

(మెళియాపుట్టి)

పాతపట్నం నియోజకవర్గాన్ని కొత్తపట్నంగా తీర్చిదిద్దుతామని, సమస్యలు పరిష్కరించి ప్రజల కష్టాలు తీర్చుతామని ఎన్నికల్లో రాజకీయ నేతలు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోయాయి. నాడు ఎన్నికల వేళ.. సీఎం జగన్‌తో పాటు వైసీపీ నేతలు ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదని నియోజకవర్గ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా-ఒడిశా సరి హద్దులో ఉన్న ఈ నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే.. ఉపాధికి ఎన్నో అవకాశాలున్నాయి. కానీ ఆ దిశగా కనీస చర్యలు చేపట్టక పోవడంతో ఉపాధి కోసం ఈ నియోజకవర్గం నుంచి అధికంగా వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎటు చూసినా అధ్వాన రహదారులు, వెంటాడు తున్న తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మరోవైపు ఆఫ్‌షోర్, వంశధార నిర్వాసితులకు ఇచ్చిన హామీలు కూడా ఉత్తి మాటలుగానే మిగిలాయని నిట్టూర్పుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో అభివృద్ధి చేసే నాయకుడ్ని ఎన్నుకోవాలని, వైసీపీని సాగనంపాలని నిర్ణయించుకున్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీ సమస్యలను పరిశీలిస్తే.. పాతపట్నంలో అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మిస్తామన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి హామీ.. ప్రకటనకే పరిమితమైంది. తాగునీటి సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదు. సామాజిక ఆస్పత్రి ఉన్నా వైద్యనిపుణుల కొరత కారణంగా సక్రమంగా సేవలు అందడం లేదు. మహేంద్రతనయ నదికి ఎస్.గోపాలపురం గ్రామానికి వంతెన లేక నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని గుమ్మగెడ్డ పనులు చేయక సాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి మండలంలో అధికంగా గిరిజనులు నివాసం ఉంటున్నారు. సుదూరప్రాంతంలో ఉన్న సీతంపేట ఐటీడీఏకు వెళ్లేందుకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజనులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. టీడీపీ హయాంలో కొండలపై గ్రామాల్లో 70శాతం రహదారుల పనులు పూర్తిచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో మిగిలిన పనులు పూర్తికాలేదు. అలాగే నెట్‌వర్క్ సమస్యలతో నిత్యావసర సరుకుల కోసం ఇబ్బందులు తప్పడం లేదు.

- ఒడిశా నుంచి అధికంగా వరదలు వచ్చినప్పుడు రాధాసాగరం గడ్డ నుంచి వరదనీరు గోకర్ణపురం గ్రామానికి పోటెత్తుతుంది. ఇలా ఐదేళ్లలో గ్రామానికి చెందిన నలుగురు వరదల్లో కొట్టుకుపోయారు. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి.. హైలెవెల్ వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు పనులు చేపట్టలేదు.
- ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు పూర్తికాలేదు. మహేంద్రతనయనది నుంచి నీరు మళ్లించి.. చీపురుపల్లి వద్ద ఈ రిజర్వాయర్ ద్వారా 2,500 ఎకరాలకు సాగునీరందించాలనే ఉద్దేశంతో 2005లో పనులు ప్రారంభించారు. కానీ నేటికీ పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేపట్టక యంత్రాలు సైతం తుప్పుపడుతున్నాయి. పాదయాత్ర సమయంలో ఆర్అండ్ఆర్ కాలనీల సమస్యలు పరిష్కరిస్తానని దాసుపురం గిరిజనులకు ప్రస్తుత సీఎం జగన్ ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదు. నష్టపరిహారం కోసం గిరిజనులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

హిరమండలంలో..

హిరమండలంలో గత వంశధార నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందిస్తామని సీఎం జగన్ హామీ.. ఇంతవరకూ నెరవేరలేదు. దానికి బదులుగా.. 2022 జూన్‌లో రూ.216 కోట్లు మంజూరు చేసినా ఇంకా 20శాతం నిర్వాసితులకు పరిహారం అందలేదు. మహేంద్రతయన నది మధ్యలో ఉన్న జిల్లేడుపేట గ్రామానికి వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చినా.. కార్యరూపం దాల్చలేదు. దీంతో వర్షాకాలంలో నాటు పడవలపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సుభలయ ఆర్అండ్ఆర్ కోలనీలో రక్షణ గోడ లేక వరదనీరు గ్రామంలోకి వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట మండలంలో వంశధార నదికి సుమారు 15 కిలోమీటర్లు పొడవునా కరకట్టలు నిర్మించాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు లేవు. ప్రతిసారీ నాయకుల హామీలే తప్ప.. 30 ఏళ్లుగా సమస్య పరిష్కారం కావడం లేదు. 2006లో కడగండి జలాశయ నిర్మాణానికి కొంతమేర పనులు చేపట్టినా.. కుడి, ఎడమ కాలువల ద్వారా ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి మండలాల రైతులకు సాగునీరు రావడం లేదు. టీడీపీ హయాంలో వంశధార, నాగావళి అనుసంధానం పనులు 80 శాతం మేర అయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి. ఎల్.ఎన్.పేటలో మెగా వాటర్ పథకం ద్వారా 46 గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉండగా.. కేవలం పది గ్రామాలకు మాత్రమే సరఫరా అవుతోంది. దీంతో వంశధార నది చెలమల నుంచి నీటిని సేకరిస్తున్నారు. అలాగే తురకపేట-దబ్బపాడు మధ్య వంతెన లేక రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



గోకర్ణపురం గ్రామానికి చేరిన వరదనీరు (ఫైల్)

కొత్తూరు మండలంలో..

కొత్తూరులో 2019లో వైఎస్ విజయలక్ష్మి బస్సుయాత్ర చేపట్టారు. ఆ సమయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు మినీ స్టేడియం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకూ నెరవేరలేదు. కొత్తూరుకు రావాల్సిన మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి సీతంపేటకు తరలిపోయింది. సామాజిక ఆస్పత్రిలో సరైన వైద్యులు లేదు. వంశధార కరకట్టల సమస్య కారణంగా పిరువాడ, కుండుబద్ర, కడుము, నివగాం, మదనాపురం, అంగూరు, ఆకుల తంపర, హంస, బలదల, పోన్నుటూరు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి.



నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులు

మౌలిక వసతులు లేవు



వైసీపీ పాలనలో గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు లేవు. రహదారులు అధ్వానంగా ఉన్నాయి. తాగునీరు, వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. కొండలపై గ్రామాలకు నిధులు మంజూరవుతున్నా.. పనులు మాత్రం కనిపించడం లేదు.

- బైరిసింగి దినకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ, మెళియాపుట్టి

పంటలు పోతున్నాయి



చెరువులు ఉన్నా పనులు కాక సాగునీరు లేక పంటలు నష్టపోతున్నాం. ఐదేళ్ల నుంచి చెరువులు, కాలువలు బాగుచేయలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నాం.

-లుగలాపు భాస్కరరావు, దీనబంధుపురం, మాజీ సర్పంచ్

పారిశుధ్య పనులే చేయలేదు



పారిశుధ్య కార్యక్రమాలకే ప్రభుత్వం నుంచి నిధులు రాక కాలువలు బాగుచేయడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయి. పనులు చేపట్టకపోవడంతో చెత్తాచెదారాలు పేరుకుపోతున్నాయి.

-బసవ పరమేష్‌రెడ్డి, మెళియాపుట్టి

నిర్వాసితులను వదిలేశారు



ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పట్టించుకోవడం లేదు. పునరావాసకాలనీలో మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్.. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకూ నెరవేరలేదు.

-సవర మల్లేస్, దాసుపురం

ఎంపీ నిధులతో అభివృద్ధి



వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు లేక పంచాయతీల్లో అభివృద్ధి జరగలేదు. పంచాయతీ నిధులు సైతం పక్కదారి పట్టించారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు నిధులు ఇవ్వడంతో గ్రామాలకు డ్రైనేజీ, కాలువలు, సీసీ రోడ్లు వేసుకున్నాం.

- రవ్వల అనూరాధ, మర్రిపాడు-సి, సర్పంచ్



చంద్రబాబుతో అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థులు

టీడీపీ అభ్యర్థులకు బీ-ఫారం

- ఉండవల్లిలో అందజేసిన చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థులకు ఆదివారం ఉండవల్లిలో పార్టీ తరపున బీ-ఫారాలను అందజేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడుకి బీ-ఫారం ఇచ్చారు. అనంతరం శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు అందజేశారు. తర్వాత శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస అభ్యర్థులు గొండు శంకర్, బెందాళం అశోక్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, బగ్గు రమణ మూర్తి, కూన రవికుమార్‌కు బీ-ఫారాలు ఇచ్చారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోని తెలియజేయాలని చంద్రబాబు సూచించారు. వైసీపీని సాగనంపాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. ఆదివారం వజ్రపుకొత్తూరు మండలంలో అయన పర్యటించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. హింసకు తావులేకుండా.. సజావుగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల నిబంధనల అమలుల్లో ఎటువంటి తేడాలు వచ్చినా.. సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పటిష్ఠంగా పనిచేసేలా ముందుగా ఏర్పాట్లు చేయాలి. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఉండాలి. పోలింగ్ సిబ్బందికి సామగ్రి అందించడంలో లోటుపాట్లు ఉండరాదు' అని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం బెండిగేటు కూడలి వద్ద ఎఫ్ఎస్‌టీ బృందం చేపడుతున్న పనులపై కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్, తహసీల్దార్ సురేష్, ఆర్ఐ పవిత్ర ఉన్నారు.



బెండిగేటు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ధర్మానపై కోడ్ ఉల్లంఘన కేసులు

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 21: రెవెన్యూమంత్రి, శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి.. ధర్మాన ప్రసాదరావుపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు శనివారం శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాలివీ. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 14న సాయంత్రం కళ్లేపల్లిలో మంత్రి ధర్మాన ప్రసాదరావు పర్యటించారు. అక్కడ గ్రామ సచివాలయం వద్ద విద్యుత్ దీపాలు అమర్చి.. ప్రచారం నిర్వహించారు. కొంతమంది స్థానికులకు వైసీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇలా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్టు ఎంసీసీ బృందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంత్రి ధర్మాన ప్రసాదరావుపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ వాసు తెలిపారు.

- అలాగే శుక్రవారం రాత్రి స్థానిక సన్‌రైజ్ హోటల్‌లో విశ్రాంత ఉద్యోగులకు ఆత్మీయ కలయిక పేరుతో ధర్మాన ప్రసాదరావు సమావేశం ఏర్పాటు చేసి.. విందు ఇచ్చారు. దీనిపై కూడా ఎంసీసీ బృందం ఫిర్యాదు చేయడంతో ధర్మానపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వాసు తెలిపారు.

28న జిల్లాకు షర్మిల రాక

పలాస రూరల్, ఏప్రిల్ 21: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 28న జిల్లాకు రానున్నారు. టెక్కలి, పలాసలో నిర్వహించనున్న బహిరంగ సభల్లో పాల్గొనున్నారు. ఈ మేరకు ఆదివారం పలాస నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దువ్వాడ జీవితేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 28న సాయంత్రం నాలుగు గంటలకు టెక్కలిలో, రాత్రి 7.30గంటలకు పలాసలో బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభిమానులు, సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి.. షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పేడాడ

టెక్కలి, ఏప్రిల్ 21: కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ పేడాడ పరమేశ్వరరావును ఎంపిక చేసినట్టు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఆదివారం రాత్రి ప్రకటించారు. పేడాడ పరమేశ్వరరావు ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. కొన్నాళ్ల కిందట వాలంటరీ రిటైర్మెంట్ ప్రకటించి.. పలు ప్రజా సంఘాల్లో పనిచేశారు. రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. పరమేశ్వరరావును ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



పేడాడ పరమేశ్వరరావు

టీడీపీలో చేరిన వలంటీర్

సరుబుజ్జిలి, ఏప్రిల్ 21: సరుబుజ్జిలి మండలం పాలవలస పంచాయతీ ఐదో క్లస్టర్ వలంటీర్ ఆడివరపు రాజబాబు ఆదివారం టీడీపీలో చేరారు. ఇటీవల వలంటీర్ రాజబాబు తన విధులకు రాజీనామా చేశారు. ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్దపాలెం, పాలవలస, రామివలస గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్ రాజబాబుతోపాటు పది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు అంబళ్ల రాంబాబు, లావేటి పూర్ణారావు, కందుల వెంకటరావు, మీసాల రామారావు, గురువు తిరుమలరావు, కొర్ను సూర్యనారాయణ, నందివాడ గోవిందరావు, తాడేల వెంకటరమణ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వలంటీర్ రాజబాబు, పలువురు వైసీపీ శ్రేణులు

'ఉద్యోగుల సంఘం' ఎన్నిక.. ఏకగ్రీవం

గుజరాతీపేట, ఏప్రిల్ 21: రాష్ట్ర ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు ఆధ్వర్యంలో జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్ అధ్యక్షతన ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా సీహెచ్ ఉమాశంకర్, కార్యదర్శిగా ఎ.తారకేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.లక్ష్మణరావుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఆర్.వేణుగోపాల్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కె.మోహనరావు వ్యవహరించారు. పరిశీలకుడిగా సాయిరాం, ఆల్ ఆంధ్ర క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, పైలశంకర్ హాజరయ్యారు.

మళ్లీ ఎలుగు అలజడి

- అమ్మవారి గుడి నుంచి జీడితోటల్లోకి..
- తలుపులు సరిగా లేక బంధించేందుకు సాహసించని అధికారులు



జీడితోటలో ఎలుగుబంటి

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 21: ఉద్దానం ప్రాంత వాసులకు ఎలుగుబంట్ల బెడద వెంటాడుతూనే ఉంది. ప్రధానంగా వజ్రపుకొత్తూరు మండలంలో ఎలుగుల సంచారంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఎలుగు దాడిలో ఇద్దరు మృతి చెందగా.. తాజాగా తర్లాగడివూరు రాజులమ్మకు చెందిన జీడితోటలోని మంకినమ్మవారి ఆలయంలో ఆదివారం ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. జీడితోటలో పిక్కలు ఏరుకునేందుకు వెళ్లిన రైతులు.. ఆ ఎలుగుబంటిని గమనించి అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖాధికారులు వచ్చి పరిశీలించగా ఆలయ తలుపులు గట్టిగా లేకపోవడం.. జీడితో టల్లో కొమ్మలు గుబురుగా ఉండడంతో ఆ ఎలుగుబంటిని బంధించేందుకు అవకాశాలు లేవని తెలిపారు. దీంతో స్థానికులు అక్కడే నిరీక్షించారు. మధ్యాహ్నం సమయంలో ఆలయం నుంచి ఎలుగుబంటి జీడితోటల్లోకి వెళ్లిపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కాగా ఎలుగుబంటిని అధికారులు బంధించకపోవ డం అన్యాయమని స్థానికుడు కోనేరు ఆదినారాయణ, పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. మళ్లీ ఆ ఎలుగు ఎవరిపై.. ఎప్పుడు దాడి చేస్తుందోనని భయాందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖాధికారులు రెడ్డి, రాజు, పోలయ్య తదితరులు మాట్లాడుతూ.. కవ్వింపు చర్యలు చేపట్టకపోతే ఎలుగుబంట్లు ఇతరులకు హాని కలిగించవని తెలిపారు. అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా మెట్టూరు హైస్కూల్ వద్ద కూడా ఎలుగుబంటి రోడ్లపై సంచరించడంతో తీరప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు.

6

ఆంధ్రజ్యోతి

శ్రీకాకుళం జిల్లా వార్తలు


సోమవారం 22 ఏప్రిల్ 2024

ఇక్కడ.. ఇదో సెంటిమెంట్

- ఇక్కడ గెలిచిన పార్టీదే అధికారమని నమ్మకం
- ఈసారి స్పీకర్ సీతారాంపై తీవ్ర వ్యతిరేకత
- టీడీపీ అభ్యర్థిగా కూన రవికుమార్
- బరిలో నిలిచిన మామా.. అల్లుడు
- గెలుపోటములను శాసించనున్న కాళింగ ఓటర్లు
- వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు
- సమన్వయంతో దూసుకుపోతున్న కూన
- నాలుగు మండలాల్లో టీడీపీకి బలమైన కేడర్

జిల్లాలో అన్ని నియోజకవర్గాల కంటే ఆమదాలవలస నియోజకవర్గం కాస్త డిఫరెంట్. ఇక్కడ నిత్యం మామ, అల్లుడు మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయం హాట్‌హాట్‌గా ఉంటుంది. వైసీపీ నుంచి స్పీకర్ తమ్మినేని సీతారాం, టీడీపీ నుంచి కూన రవికుమార్ బరిలో ఉన్నారు. ఇక్కడ అత్యధికంగా కాళింగ ఓటర్లు ఉన్నారు. అభ్యర్థుల గెలుపోటములను వీరే శాసించనున్నారు. అంతర్గత కుమ్ములాటలతో వైసీపీ సతమతమవుతుంటే, టీడీపీ మాత్రం సమన్వయంతో దూసుకుపోతుంది. ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తోందో అదే పార్టీ రాష్ట్రంలో కూడా అధికారంలోకి వస్తుందనే నమ్మకం ఓటర్లలో ఉంది. అయితే ఈ ఎన్నికల్లో ఈ సెంటిమెంట్ నిలుస్తుందో లేదో చూడాలి.

-(ఆమదాలవలస)




ఆమదాలవలస పట్టణం


కూన రవికుమార్ | తమ్మినేని సీతారాం | బొడ్డేపల్లి సత్యవతి | సువ్వారి గాంధీ

అన్ని ఎన్నికల్లోనూ కాళింగులే..

ఆమదాలవలస నియోజకవర్గం 1978లో ఏర్పడింది. 1976లో జరిగిన డీలిమిటేషన్ ప్రకారం అప్పటివరకు ప్రస్తుతం జలుమూరు మండలంలోని నగిరికటకం నియోజకవర్గంగా ఉన్న ప్రాంతమంతా ఆమదాలవలస నియోజకవర్గంగా ఆవిర్భవించింది. తొలిసారిగా 1978లో ఆమదాలవలసలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 83,676 ఓట్లకు గాను పోలింగ్ జరిగింది. ఎన్నికల్లో పైడి శ్రీరామ్మూర్తి, పీరుకట్ల వెంకటప్పలనాయుడు, తమ్మినేని పాపారావుతో పాటు మెట్ట జగ్గభట్లు, బాణ్ణ కరుణాకరావు పోటీ చేశారు. కాంగ్రెస్ (ఐ) అభ్యర్థి పీరుకట్ల వెంకటప్పలనాయుడుపై ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పైడి శ్రీరామూర్తి 3,357 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాళింగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే శాసనసభ్యులుగా ఎన్నికవుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా కాళింగ కులస్థుల మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. వైసీపీ నుంచి తమ్మినేని సీతారాం, టీడీపీ నుంచి కూన రవికుమార్, సత్వంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ మధ్య ప్రధాన పోటీ ఉంది.

- 1983 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాం కాంగ్రెస్ అభ్యర్థి పైడి శ్రీరామ్మూర్తిపై 4,273 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఎనిమిది మంది అభ్యర్థులు అసెంబ్లీ బరిలో నిలిచారు.
- 1985 జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు పోటీ చేయగా మళ్లీ పైడి శ్రీరామ్మూర్తిపై టీడీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాం 2,129 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.
- 1989 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాంపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పైడి శ్రీరామ్మూర్తి 3,496 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన కిల్లి వరహా నరసింహం ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేశారు. శ్రీరామ్మూర్తి అనారోగ్యంతో మృతిచెందడంతో 1991లో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డేపల్లి రాజగోపాలరావుపై టీడీపీ అభ్యర్థి తమ్మినేని విజయం సాధించారు.
- 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డేపల్లి చిట్టిబాబుపై 5,234 మెజార్టీతో విజయం సాధించి రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం పొందారు. ఈ ఎన్నికల్లో ఏడుగురు అభ్యర్థులు పోటీపడ్డారు.
- 1999 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సీతారాం అప్పటి ఆమదాలవలస మునిసిపల్ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డేపల్లి సత్యవతిపై కేవలం 1,511 అతి స్వల్ప ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.
- 2004లో టీడీపీ తరపున తమ్మినేని సీతారాం, కాంగ్రెస్ తరపున బొడ్డేపల్లి సత్యవతి పోటీచేయగా సత్యవతి 3,686 ఓట్లతో గెలుపొందారు.
- 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బొడ్డేపల్లి సత్యవతి, ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా తమ్మినేని సీతారాం, టీడీపీ అభ్యర్థిగా కూన రవికుమార్‌లతో పాటు మరో ఐదుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ అభ్యరి బొడ్డేపల్లి సత్యవతి ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ 16,209 ఓట్లతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
- 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్, వైసీపీ అభ్యర్థి తమ్మినేనిపై 5,449 ఓట్లు మెజార్టీతో విజయం సాధించి రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టారు.
- 2019లో వైసీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాం, టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ తలపడగా సీతారాం 13,991 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి ప్రస్తుతం శాసనసభాపతిగా కొనసాగుతున్నారు.
- ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కూన రవికుమార్, వైసీపీ అభ్యర్థిగా తమ్మినేని సీతారాంలను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించించాయి. ఇక వైసీపీ రెబల్ అభ్యర్థిగా సువ్వారి గాంధీ ప్రచారం చేస్తున్నారు.


కూన రవికుమార్ హయాంలో ఏర్పాటు చేసిన టిడ్కో గృహాలు

పతాకస్థాయికి వైరం..

నియోజకవర్గంలో మామ, అల్లుడు సవాళ్ల రాజకీయం హాట్‌హాట్‌గా సాగుతోంది. తమ్మినేని సీతారాం ఇప్పటివరకు 11సార్లు ఎన్నికల్లో పోటీ చేయగా ఆరుసార్లు విజయం సాధించారు. తాజాగా 12వ సారి నామినేషన్ వేయనున్నారు. కూన రవికుమార్ ఇప్పటివరకు మూడు సార్లు పోటీ చేసి ఒకసారి విజయం సాధించారు. ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టడంతో రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రస్తుతం నాలుగోసారి నామినేషన్ వేశారు. ఈ ఎన్నికల్లో మామ తమ్మినేని సీతారాం మరోసారి జెండా ఎగరేస్తారా, అల్లుడు కూన రవికుమార్ చక్రం తిప్పుతాడ పొలిటికల్‌గా ఇంట్రస్టింగ్‌గా మారింది. 2014లో సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా కూన రవికుమార్ గెలిచారు. 2019లో మేనల్లుడు రవికి తమ్మినేని సీతారాం చెక్‌పెట్టారు. తమ్మినని, కూన రవికుమార్ మామఅల్లుల్లే కాదు..బావా బామ్మర్దులు కూడా. కూన రవికుమార్ సోదరినే సీతారాం వివాహం చేసుకున్నారు. తమ్మినేని, కూన రవికుమార్ ఒకే కుటుంబ సభ్యులైనా ఈ ఇద్దరి మధ్య వైరం పతాకా స్థాయికి చేరింది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ప్రస్తుతం రాజకీయం నడుస్తోంది.

సీతారాంపై వ్యతిరేకత

నియోజకవర్గంలో అంతర్గత కుమ్ములాటలతో వైసీపీ సతమతమవుతోంది. ప్రధానంగా 2019 ఎన్నికల్లో తమ్మినేని సీతారాం గెలుపునకు అందరూ ఐక్యంగా కృషిచేశారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో కీలకమైన నాయకులతో సీతారాంకు పొసగలేదు. దీంతో బాహాటంగానే వారంతా కొంతకాలంగా వ్యతిరేకిస్తున్నారు.


టీడీపీ హయాంలో వేసిన రాపాక-సీపన్నాయుడుపేట రోడ్డు

ఓటర్ల వివరాలు..

ఆమదాలవలస నియోజకవర్గంలో 1,93,479 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 95,985, మహిళలు 97,477 మంది, 15 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ● ఆమదాలవలస మండలంలో కాళింగులు 18,043, తూర్పుకాపు 6,203, ఎస్సీ మాల 3,887, పి.వెలమ 3,347, తెలగ 1348 మంది ఓటర్లు ఉన్నారు. ● ఆమదాలవలస మునిసిపాలిటీలో కాళింగ 11,387, పి.వెలమ 4,702, టి.కాపు 1606, కె.వైశ్య 1754, ఎస్సీ మాల 1608 మంది ఉన్నారు. ● సరుబుజ్జిలి మండలంలో టి.కాపు 8,376, కాళింగ 6,904, పి.వెలమ 2,843, ఎస్సీ మాల 2,507, రజక 959 ● బూర్జ మండలంలో టి.కాపు 13,546, ఎస్సీ మాల 4,245, కాళింగ 3,754, నగరాలు 1806, పి.వెలమ 1721 ● పొందూరు మండలంలో కాళింగ 23,325, టి.కాపు 14,578, ఎస్సీ మాల 4,780, పట్టుశాలి 3,657, యాదవ 3,580 ఉంది ఓటర్లు ఉన్నారు.

టికెట్ ఆశించి భంగపడిన వైసీపీ సీనియర్ నాయకుడు సువార్ గాంధీ పార్టీకి రాజీనామా చేశారు. ఇంటిపెండెంట్‌గా బరిలో దిగారు. దీంతో ఈసారి సీతారాం గెలుపు అంత సులువుకాదని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి.

బలంగా టీడీపీ..

టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. దీనికితోడు నాలుగు మండలాల్లోనూ బలమైన కేడర్ ఉంది. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను కూన రవికుమార్ ఎండగడుతూ ముందుకు వెళ్తున్నారు. టీడీపీ ప్రభుత్వహయాంలో కూన రవికుమార్ కృషి ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వంశధార, నాగావళి నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారు. అయితే ఈ ప్రక్రియను టీడీపీ ప్రభుత్వం ప్రారంభించినా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో నిధులు కేటాయించకపోవడంతో నదుల అనుసంధానం నిలిచిపో యింది. దీంతో సరుబుజ్జిలి, బూర్జ మండలాలతో పాటు జిల్లాలో పలు ప్రాంతాల రైతులకు ఎదురుచూపులు మిగుతున్నాయి.

మొదటి మహిళా ఎమ్మెల్యేగా సత్యవతి..

1962 నుంచి 1999 వరకు జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో పురుషులు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1999లో దివంగత నేత బొడ్డేపల్లి రాజగోపాలరావు వారసురాలిగా ఆమె కోడలు బొడ్డేపల్లి సత్యవతి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాంపై విజయం సాధించి నియోజకవర్గంలో తొలి మహిళా ఎమ్మెల్యేగా ఎన్నికై చరిత్ర సృష్టించారు.

కూన హయాంలోనే రోడ్లకు మహర్దశ..

2019 ఎన్నికల్లో గెలుపొందిన కూన రవికుమార్ నియోజకవర్గంలో అభివృద్ధిపై దృష్టిసారించారు. ఆయన హయాంలోనే రోడ్లకు మహర్దశ పట్టింది. ప్రధానంగా పొందూరు మండల వాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కోర్టును పొందూరు మార్కెట్ యార్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. దీంతో కోర్టు పనుల కోసం రాజాం తిరగాల్సిన ఇబ్బందులు తప్పాయి. అంతేకాకుండా గ్రామీణ ప్రాంత రోడ్లు అభివృద్ధికి నోచుకున్నాయి. సుమారు రూ.11 కోట్లతో రాపాక, సీపన్నాయుడుపేట వరకు రోడ్డు నిర్మాణంతో పొందూరు, సమీప గ్రామాల వారికి శ్రీకాకుళం వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు సౌకర్యం ఏర్పడింది. ఆమదాలవలస మునిసిపాలిటీలో ఇళ్లులేని నిరుపేదలకు టిడ్కో ఆధ్వర్యంలో 528 గృహాలు మంజూరుచేయించారు.

జన కేతనం



మీకు తెలుసా?

ఇప్పటి వరకు 15 సార్వత్రిక ఎన్నికలు

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1952 నుంచి 2014 వరకు 14 సార్లు ఎన్నికలు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చి నప్పటిన తర్వాత 1952లో తొలిసారి రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1957 ఫిబ్రవరి 25, 1962 ఫిబ్రవరి 19, 1967 ఫిబ్రవరి 8, 1972 మార్చి 15, 1978 ఫిబ్రవరి 25, 1983 మే 1, 1985 మే 3, 1989 నవంబరు 22, 1994 డిసెంబర్ 1, 1999 సెప్టెంబరు 18, 2004 ఏప్రిల్ 20, 2009 ఏప్రిల్ 16, 2014 ఏప్రిల్ 30, 2019 ఏప్రిల్ 11న ఎన్నికలు జరిగాయి.

-హిరమండలం



ఓటంటే నిర్లక్ష్యం వద్దు..

రణస్థలం: ఓటంటే నిర్లక్ష్యం వద్దు.. నా ఒక్క ఓటే కదా, వేయకపోతే ఏమైపోతుందిలేనని అనుకోవద్దు.. ఒకసారి ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే స్వల్ప ఓట్ల తేడాతో రాజకీయ భవితను కోల్పోయినవారున్నారు. 1989లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన కొణతాల రామకృష్ణ కేవలం 9 ఓట్ల మెజార్టీతో లోక్‌సభలో అడుగుపెట్టే అదృష్టం దక్కించుకున్నారు. 1999లో వాజ్‌పేయి ప్రభుత్వం ఒకే ఒక్క తేడాతో అధికారాన్ని చేజార్చుకుంది. ఒక ఓటు తేడాతో ఇంగ్లీష్‌పై గెలిచి హిందీ మనదేశ జాతీయ భాషగా గుర్తింపు పొందింది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా సంఘటనలు ఉన్నాయి. కేవలం ఒక ఓటు గెలుపుఓటమిలను ప్రభావితం చేస్తుందా ? అని ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడంలో అశ్రద్ధ చూపుతున్నారు. అలా కాకుండా ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

ఎర్రజెండా ఉండాల్సిందే..

- ప్రతి ఎన్నికల్లోనూ వామపక్షాల పోటీ
- గెలుపోటములతో సంబంధం లేకుండా బరిలోకి..
- అంతా బొడ్డపాడుకు చెందిన విప్లవ నాయకులే

పలాస రూరల్: పలాస మండలంలోని బొడ్డపాడు పేరుచెప్పగానే గుర్తొచ్చేది పోరాటాలు, విప్లవాలు, ఎర్ర జెండాలు. అణగారిన వర్గాల రక్షణకు, వారి మనుగడకు కావాల్సిన హక్కుల పోరాటం చేసి న్యాయంచేయడంలో ఆది నుంచి సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ ముందుంది. ఈ గ్రామం రాష్ట్రంలోనే కాక దేశంలో సాయుధవిప్లవ పోరాటంలో ప్రత్యేక కలిగిఉంది. దేశం స్వాతంత్ర్యం సాధించిన తర్వాత కొన్ని రాష్ట్రాల్లో జమిందారీ విధానాలు, ఫ్యూడల్ భావాలు ప్రజ్వరిల్లుతున్న తరుణంలో పశ్చిమబెంగాల్‌లోని ఓ మారుమూల ప్రాంతమైన నక్సల్‌బరీలో 1967లో విప్లవపోరాటం పురుడుపోసుకుంది. అక్కడ జమిందారీ విధానాలపై చారుమజుందార్ నాయకత్వంలో సాయుధ పోరాటం ప్రారంభమయ్యింది. అక్కడి బాటలోనే శ్రీకాకుళంలోని బొడ్డపాడులో విప్లవ భావాలు పురుడు పోసుకున్నాయి. ఆయుధాలబాట పట్టి జమిందారీ,పెత్తందారుల ఆగడాలపై తిరుగుబాటు చేపట్టారు. 1968-69, 1969-70, 1970-72 సంవత్సరాల మధ్య అణగారిన వర్గాల సమస్యలపై పోరాడిన వెంపటాపు సత్యం, పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి, ఆదిభట్ల కైలాసం, సత్యం, సుబ్బారావు పాణిగ్రాహి వంటి విప్లవవీరులు ఈ పోరులో అశు వులు బాశారు. ఆ గ్రామస్థులు నిత్యం వామపక్ష భావాలతోనే ముడిపడిఉన్న సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీతోనే నడుస్తున్నారు. ఈ దశలో మొదటిసారిగా ఈ గ్రామం నుంచి 1984లో మద్దిల మల్లేశ్వరరావు ఎమ్మెల్యే గా సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నుంచి బరిలో దిగారు. అక్కడి నుంచి ప్రతి ఎన్నికల్లోనూ వామపక్ష భావాలను తెలియజేస్తూ ఎన్నికల బరిలో ఉంటు న్నారు. పలాస నియోజకవర్గం నుంచి1999లో తామాడ త్రిలోచనరావు, 2004లో తెలకల కృష్ణారావు, 2009లో మద్దిల రామారావు, లోక్‌సభ నియోజకవర్గం నుంచి బొడ్డు వాసు, 2019లో పోతనపల్లి కామేశ్వరరావు పోటీచేశారు. ఈ ఎన్నికల్లోనూ పోతనపల్లి కామే శ్వరరావు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. పేద,అణగారిన వర్గాల అభ్యున్నతే తమ పార్టీ లక్ష్యమని, ఆ దిశగా పార్టీ ఎప్పుడు బూర్జువా పార్టీలకు పోరుబాటలో ఎదురు నిలుస్తూ పోటీలో ఉంటున్నామని వామపక్ష నాయకులు తెలిపారు. గెలుపోటములు సహజమని, పీడిత,తాడిత ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పెట్టుబడుదారీ పార్టీలకు వ్యతిరేకంగా తమ పార్టీ పేదల పక్షాన పోరాడుతోందని చెప్పారు. 1968 నుంచి నేటి వరకూ వామపక్ష భావజాలంతో ఈ ప్రాంత నాయకులు ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరుసాగిస్తున్నారు. గ్రామంలో అమరవీరుల స్మారక మందిరం కూడా నిర్మించారు. ఆ మందిరంలో సామ్యవాద, కమ్యూనిజం భావాలను తెలియజే వివిధ దేశాధినేతల చిత్రపటాలను నిలిపి వారి విప్లవభావాలను చాటుతూ ముందుకు సాగుతున్నారు.



బొడ్డపాడులోని అమరవీరుల స్మారకమందిరం

గత ముచ్చట

కాలినకడన వెళ్లి ప్రచారం


దువ్వాడ నాగావళి

ఆనాటి రాజకీయాలు విలువలతో కూడుకున్నవి. నేను టెక్కలి టీడీపీ అభ్యర్థిగా 1989-94లో పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సత్తారు లోకనాథంనాయుడుపై 7,500 మెజార్టీతో గెలుపొందాను. రాజకీయ నేపథ్యం కుటుంబం నుంచి రావడంతో వాటిపై ఆసక్తి ఉండేది. ప్రస్తుతం రాజకీయాల్లో వేగవంతమైన మార్పులు సంభవించాయి. నాడు ఇంతవేగమైన మార్పులు లేవు. తన ఐదేళ్ల ఎమ్మెల్యే పదవీకాలంలో వరల్డ్‌బ్యాంకు నుంచి తీసుకొచ్చిన రుణాలతో రోడ్లు వేయడంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టాం. ఎన్నికల సమయంలో గ్రామాలకు నడకదారిన వెళ్లి ప్రచారంచేసే వాళ్లం. ఇంత విప్లవాత్మక మాధ్యమాలు ఆరోజుల్లో లేవు. ప్రస్తుతం రాజకీయాల్లో పెనుమార్పులు వచ్చాయి. అప్పట్లో ప్రజలకు సన్నిహితంగా ఉండి వారితో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేసేవాళ్లం.

-పలాస రూరల్

సమాచారం

13న వేతనంతో కూడిన సెలవు

గార: జిల్లాలో మే 13న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ రోజు ఆంధ్రప్రదేశ్ దుకా ణాల, సంస్థల చట్టం-1988 ప్రకారం దుకాణాలు, సంస్థలకు సెలవు ప్రకటించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా వ్యాపారం, పారిశ్రామిక సంస్థ, ఏదైనా ఇతర సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న ప్రతివ్యక్తి, ఓటు వేయడానికి అర్హులైన అందరికీ పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు. ఏ యజమాని అయినా ఈ నిబంధనను ఉల్లంఘించి వారి వద్ద ఉద్యోగులకు ఓటే వేసే అవకాశం కలిగించకుంటే జరిమానా, శిక్ష తప్పదని తెలిపారు.

అరుదైన గౌరవం

తొలి మహిళా స్పీకర్ ప్రతిభాభారతి



రణస్థలం: టీడీపీలో గుర్తింపు పొందిన నాయకుల్లో ప్రతిభా భారతి ఒకరు. మంత్రిగా, శాసనసభ తొలి మహిళా స్పీకర్‌గా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. 1983లో ఎన్టీఆర్ పిలుపు మేరకు ప్రతిభాభారతి టీడీపీలో చేరారు. 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా ఎచ్చెర్ల ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందారు. 1983 తొలి ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో తొలి ఫలితం ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచే వచ్చింది. ఆ సమయంలో ప్రతిభాభారతి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. దీన్ని సెంటిమెంట్‌గా భావించిన ఎన్టీఆర్ ఆమెను తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అప్పట్లో కేబినెట్‌లో ఉన్న ఏకైక మహిళా మంత్రి కూడా ప్రతిభా భారతి కావడం మరో విశేషం. ఎన్టీఆర్ కేబినెట్‌లో రెండుసార్లు ఆమెకు చోటుదక్కింది. 1995లో చంద్రబాబు తన కేబినెట్‌లోకి ప్రతిభాభారతిని తీసుకుని విద్యాశాఖను కేటాయించారు. 1999లో ఆమెకు స్పీకర్‌గా చోటుకల్పించారు. దీంతో రాష్ట్రంలోనే తొలి మహిళా స్పీకర్‌గా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు.

సీనియర్ ఓటర్

ఇక్కడి రాజకీయాలు చాలాతేడా



నేను నా భర్తతో కలిసి 40 ఏళ్ల కిందట పశ్చిమ బెంగాల్ నుంచి ఉపాధి కోసం ఇక్కడకు వచ్చా. ప్రస్తుతం కుమారుడి వద్ద నివాసముంటున్నా. అక్కడి రాజకీయాలకు ఇక్కడి రాజకీయాలకు తేడాఉంది. అక్కడ ఉన్నప్పుడు చాలాసార్లు ఓటు వేశా. అక్కడి నాయకులు ఓటు అడిగినప్పుడు వినయంగా, క్రమశిక్షణతో అడుగుతారు. కానీ, ఇక్కడ మాత్రం బెదిరింపు ధోరణితో ఓటువేయాలని కోరుతున్నారు. ఎవరికి వేస్తారో ముందుగా చెప్పాలని అడుగుతున్నారు. ఓటు వేయకుంటే పింఛన్లు, పథకాలు తొలగిస్తామని బెదిరిస్తున్నారు. అప్పట్లో రాజకీయాలు హుందగా ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితిలేదు.

-బెహరా ఉత్తమ్ (85 ఏళ్లు), పదోవార్డు పొందర వీధి, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ

జన కేతనం
ఆంధ్రజ్యోతి
సోమవారం 22 ఏప్రిల్ 2024



నిలిచిపోయిన ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు

అమాత్యా..

హామీలు మరిచారా?

● కాశీబుగ్గ-అక్కుపల్లి రింగురోడ్డు ఏమైంది? ● ఆఫ్‌షోర్ గుర్తుందా? ● ఫ్లైఓవర్‌కు మళ్లీ శంకుస్థాపన చేశారు కదా!
● ఒక్కటీ కూడా అమలు కాలేదు ● నిధులు లేక నిలిచిన మరికొన్ని పనులు

(పలాస)

పలాస నియోజకవర్గ ప్రజలకు మంత్రి సీదిరి అప్పలరాజు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ కూడా పూర్తిగా అమలు కాలేదు. మాటలు ఎక్కువ.. పనులు తక్కువ అన్న చందంగా పరిస్థితి ఉంది. మంత్రి హామీలు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రధానంగా కాశీబుగ్గ-బెండి వయా అక్కుపల్లి రింగురోడ్డు, కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్, వంశధార కాలువ ఆధునికీకరణ, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి, మందస మండలంలోని ప్రధాన రిజర్వాయర్లు ఆధునికీకరణ, జంతిబంద కొత్త రిజర్వాయరు, హరిపురం నుంచి మందస వరకూ రెండులైన్ల రహదారి వంటి హామీలు నేటికీ అమలు కాలేదు. ఎన్నికలు రావడంతో వాటిపై నీలినీడలు అలముకున్నాయి. కిడ్నీ పరిశోధన కేంద్రం, సమగ్ర మంచినీటి పథకాలు పూర్తి చేశామని చెబుతున్నా వాస్తవానికి మాత్రం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి చుక్క నీరు అందని పరిస్థితి నెలకొంది. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు ఇంకా పూర్తిస్థాయి నీరు సరఫరాకావడం లేదని సాక్ష్యాత్తు వైసీపీ నాయకులే చెబుతున్నారు. కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల ఆసుపత్రి ప్రారంభించిన రోజు నుంచే అమలులోకి రావాల్సి ఉంది. అయితే డయాలసిస్ యూనిట్లు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి తీసుకొచ్చి ఏర్పాటు చేశారు. పరిశోధన కేంద్రానికి తగిన వనరులు, పరికరాలు లేకపోవడంతో కాస్త పెద్దాసుపత్రిగా మారింది.

ముందుకు సాగని పనులు

పలాస-చిన్నబడాం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి 2009, ఫిబ్రవరి 22న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న హనుమంతు అప్పయ్యదొర రూ.17.27 కోట్లతో శంకుస్థాపన చేశారు. దీంతో పాటుగా బెండి బ్రిడ్జికి కూడా శంకుస్థాపన చేశారు. బెండి బ్రిడ్జిని అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. పలాస బ్రిడ్జి మాత్రం వివిధ కారణాలతో నిలిచిపోయింది. దీన్ని తామే నిర్మిస్తామని చెప్పి రెండేళ్ల కిందట మంత్రి అప్పలరాజు మళ్లీ శంకుస్థాపన చేశారు. ఈ పనులు రెండు అడుగులు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. బడ్జెట్ అంచనా పెరగడం, నిధులు పూర్తిగా నిలుపుదల చేయడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. పలాసలో ఫ్లైఓవర్ లేకపోవడంతో జంటపట్టణాల్లోకి వెళ్లడానికి వాహనచోదకులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు.

నిర్వాసితుల అగచాట్లు

పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, టెక్కలి, మెళియాపుట్టి మండలాల్లోని 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలనే సంకల్పంతో దీన్ని నిర్మించేందుకు రూ.123 కోట్లతో ప్రతిపాదించారు. అయితే నిధులు సకాలంలో విడుదలకాక పోవడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పెరిగిన ఎస్ఎస్ఆర్ ధరలకు అనుగుణంగా రూ.550 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన ఆమోదం లభించింది. అయితే వివిధ కారణాలతో పనులు పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తామే పూర్తిచేశామని బీరాలు పలికింది. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూ.850 కోట్లు నిధులకు ఆమోదించారు. ఈ ఐదేళ్లలో కనీసం రూ.కోటి విలువైన పనులు కూడా జరగక పోవడం విశేషం. దీంతో పాటుగా నిర్వాసితులకు ఇచ్చిన కాలనీలో కూడా మౌలిక సదుపాయాలు కల్పించలేదు. వారంతా అగచాట్లకు గురవుతున్నారు. ఆఫ్‌షోర్‌కు ఉదారంగా భూములు ఇస్తే తమకు ఇచ్చిన గౌరవం ఇదేనా అని వారంతా ప్రశ్నిస్తున్నారు. తండ్రి రాజశేఖర రెడ్డి శంకుస్థాపన చేసిన ఈ జలాశయం పూర్తిచేయడానికి కుమారుడు జగన్మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేయకపోవడంపై ఈ ప్రాంత ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.



పలాస వద్ద వంశధార కాలువలో పూడికలు చేరిన వ్యర్థాలు

వంశధార కాలువపై నిర్లక్ష్యం

పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వంశధార శివారు ఆయకట్టుకు ఏనాడూ పూర్తిస్థాయిలో నీరందడం లేదు. కాలువల నిర్వహణపై అధికారు లు దృష్టిపెట్టకపోవడంతో పూడిక పేరుకుపోయింది. దీంతో ఏటా పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో 9 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతు లకు కన్నీరే మిగులుతోంది. ప్రస్తుతం కాలువ పూడికపోయి అనేక ప్రాంతాల్లో మురుగునీరు ప్రవహిస్తోంది. కనీసం రూ.100 కోట్లు విడుదల చేసి లైనింగ్ పనులు పూర్తిచేస్తే కాలువల ద్వారా నీరు పారే అవకాశముంటుందని రైతు సంఘాలు చెబుతున్నాయి. పక్క నియోజకవర్గం నాయకులు వంశధార నీటిని తోడుకొని వెళ్లిపోతుండడంతోనే నీరు రావడం లేదని సాక్ష్యాత్తు మంత్రి చెబుతుండడం విశేషం. ఐదేళ్ల కిందట కాలువను ప్రారంభించిన మొదట్లో ఆయకట్టుకు ఏటా నీరం దేది. ఆ తర్వాత కాలువ నిర్వహణపై దృష్టిసారించకపో వడంతో ఏటా ఇక్కడి రైతులు వర్షాధారంపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ దుస్థితిపై సాక్ష్యాత్తు వైసీపీకి చెందిన ఎంపీపీ ఉంగ ప్రవీణ జడ్పీ సమావేశంలో నిలదీసినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం విశేషం.

నిలిచిన కాశీబుగ్గ-అక్కుపల్లి రింగురోడ్డు

కాశీబుగ్గ నుంచి బెండిగేటు వయా అక్కుపల్లి వరకూ సుమారు 10 కిలోమీటర్ల రింగురోడ్డు నిర్మాణానికి మంత్రి అప్పలరాజు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గత పాలకుల వైఫల్యాలపై తీవ్ర విమర్శలు కూడా గుప్పించారు. ఈ రోడ్డును ఏడాదిలో పూర్తి చేస్తామని కూడా మంత్రి గొప్పలు చెప్పారు. అయితే, బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే ఈ పనులు నిలిపివేశారు. దీంతో తాళభద్ర ధర్మపురం, అక్కుపల్లి, బాతుపురం, చినవంక, వజ్రపుకొత్తూరు ప్రాంతాల్లో రహదారిపై రాళ్లు తేలడంతో రాకపోకలకు ప్రజలు అగచాట్లు పడుతున్నారు. ఈ రోడ్డు పూర్తిచేసే ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్తానన్న మంత్రి ఆ హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారు.



కాశీబుగ్గ వైపు ప్రారంభంకాని బ్రిడ్జి పనులు



తాళభద్ర రోడ్డులో రాళ్లుదేరిన దుస్థితి

అర్బన్ ఓటర్లే కీలకం

● గెలుపోటములను నిర్దేశించింది వారే
● దాదాపు అన్ని నియోజకవర్గాల్లో వారే సింహభాగం
● పట్టణ ప్రాంతాల్లో అధికార పార్టీపై వ్యతిరేకత

(రణస్థలం)

జిల్లాలో ఈసారి అర్బన్ ఓటర్లు కీలకంగా వ్యవహరించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల నిర్ణయమే గెలుపోటములను నిర్దేశించనుంది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పట్టణ ప్రాంతాలు ఉన్నాయి. ప్రధానంగా మునిసిపాల్టీలు ఉన్న నియోజకవర్గాల్లో అయితే మిగతా రూరల్ ఓటర్లతో సమానంగా అర్బన్ ఓటర్లు ఉండడం విశేషం. సాధారణంగా గ్రామాల్లో బలాబలాలు అన్ని పార్టీలకు సమానంగా ఉంటాయి. కొన్ని గ్రామాల్లో పదుల ఓట్లు, మరికొన్ని గ్రామాల్లో వందల ఓట్లు మాత్రమే మెజార్టీ వస్తుంటుంది. అదే పట్టణాలు, మునిసిపాల్టీల విషయానికి వచ్చేసరికి ఓట్లు ఎక్కువగా ఉండడంతో భారీ మెజార్టీలు సాధించడానికి అవకాశం ఉంటుంది. అప్పుడు రూరల్‌లో కోల్పోయిన మెజార్టీ ఒక్క మునిసిపాల్టీలోనే అధిగమించే చాన్స్ ఉంటుంది. అందుకే అన్ని రాజకీయ పార్టీలు, పట్టణాలు, అర్బన్ ప్రాంతాలపై దృష్టిపెట్టాయి.

● ఎచ్చెర్ల నియోజకవర్గంలో 2,37,999 మంది ఓటర్లు ఉన్నారు. ప్రధానంగా జేఆర్‌పురం, పైడిభీమవరం, రణస్థలం, ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు వెంకటాపురం పట్టణ ప్రాంతాలుగా ఉన్నాయి. ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం బైపాస్ వరకూ, శ్రీకాకుళం నగరంలోని శివారు ప్రాంతాలు ఎచ్చెర్లలో కొనసాగుతున్నాయి. వీటిపైనే అన్నిపార్టీలు దృష్టిపెట్టాయి. ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.

● శ్రీకాకుళం నియోజకవర్గంలో 2,63,034 మంది ఓటర్లు ఉన్నారు. ఒక్క శ్రీకాకుళం కార్పొరేషన్‌లో 1.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారే గెలుపోటములను నిర్దేశించగలరు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి 1200 ఓట్ల మెజార్టీ ఒక్క శ్రీకాకుళం నగరంలోనే లభించింది. అందుకే ఈ ఎన్నికల్లో అన్ని పార్టీలు శ్రీకాకుళం నగరంపైనే దృష్టిపెట్టాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎక్కువగా స్థిరనివాసం ఏర్పాటుచేసుకుంటారు. వ్యాపార వర్గాలు కూడా అధికం. దీంతో వారి మద్దతు పొందేందుకు చాపకింద నీరులా పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. గార, శ్రీకూర్మం, కళింగపట్నం వంటి మేజర్ పంచాయతీలో సైతం ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారు.

● నరసన్నపేటలో 2,06,518 ఓట్లు ఉన్నాయి. ఒక్క నరసన్నపేట పట్టణంలోనే 22 వేల ఓట్లు ఉన్నాయి. గతంలో నరసన్నపేట పట్టణమే గెలుపోటములను నిర్దేశించిన సందర్భాలున్నాయి. మండల కేంద్రాలుగా ఉన్నా పోలాకి, జలుమూరు, సారవకోటలో సైతం గణనీయమైన ఓట్లు ఉన్నాయి. ఉర్లాం వంటి పంచాయతీ సైతం గెలుపోటములను ప్రభావితం చేస్తుంది. అందుకే నరసన్నపేటతో పాటు మేజర్ పంచాయతీల్లో పాగా వేసేందుకు పార్టీలు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.

● టెక్కలి నియోజకవర్గంలో 2,34,606 ఓట్లు ఉన్నాయి. టెక్కలి మేజర్ పంచాయతీలో22 వేల ఓట్లు ఉన్నాయి. కోటబొమ్మాళిలో 15 వేల వరకూ ఓట్లు ఉన్నాయి. నందిగాం, సంతబొమ్మాళి మండల కేంద్రాల్లో సైతం ఓటర్లు అధికం. అందుకే అక్కడ పట్టుబిగించేందుకు పార్టీలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి.

● పాతపట్నం నియోజకవర్గంలో 2,24,665 ఓట్లు ఉన్నాయి. పాతపట్నం మేజర్ పంచాయతీలో 22 వేలు, హిరమండలం మేజర్ పంచాయతీలో 12 వేలు ఓట్లు ఉన్నాయి. మెళియాపుట్టి, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండల కేంద్రాలు సైతం 5 నుంచి 10 వేల వరకూ ఓట్లు ఉన్నాయి. ఇవన్నీ గెలుపోటములను నిర్దేశించినవే. అందుకే అక్కడ పట్టు కోసం అన్ని పార్టీలు ఆరాటపడుతున్నాయి.

● పలాస నియోజకవర్గంలో 2,10,177 ఓట్లు ఉన్నాయి. పలాస,కాశీబుగ్గ మునిసిపాల్టీలోనే 47 వేల ఓట్లు ఉన్నాయి. అటు హరిపురం, మందస, వజ్రపుకొత్తూరు, బ్రాహ్మణతర్లా, నువ్వలరేవు పంచాయతీలో ఎక్కువ ఓట్లు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో మెజార్టీ కోసం అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. జంట పట్టణాల్లో వ్యాపార వర్గాలు అధికం. అందుకే వారి మద్దతు పొందేందుకు అన్నిపార్టీలు చాపకింద నీరులా ప్రయత్నాలు ప్రారంభించాయి.

● ఆమదాలవలస నియోజకవర్గంలో 1,89,307 ఓట్లు ఉన్నాయి. ఒక్క ఆమదాలవలస మునిసిపాల్టీలోనే 27 వేలమంది ఓటర్లు ఉన్నారు. అటు పొందూరు మేజర్ పంచాయతీలో 10 వేలకుపైగా ఓట్లు ఉన్నాయి. బూర్జ, సరుబుజ్జిలిలో సైతం ఓట్లు అధికం. దీంతో అక్కడ పాగా వేసేందుకు అన్ని పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

● ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అర్బన్ ఓటర్లు అధికం. 2,59,712 ఓట్లు ఉన్నాయి. ఇందులో ఒక్క ఇచ్ఛాపురం మునిసిపాల్టీలోనే 30 వేలకుపైగా ఓట్లు ఉన్నాయి. సోంపేట, కవిటి, బారువ మేజర్ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో మరో 30 వేల మంది ఓటర్లు ఉన్నారు. కంచిలి, ఈదుపురం, సోంపేట మండలంలో ఏడూళ్ల పాలెంలో వేలాది మంది ఓటర్లు ఉన్నారు. దీంతో ఇక్కడ పాగా వేసేందుకు అన్ని పార్టీలు ప్రయత్నాలు ముమ్మారం చేశాయి.



విద్యాధికులే అధికం

ఈసారి పట్టణ ఓటర్లు వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారు. పలు సర్వేల్లోనూ ఇదే తేలింది. సాధారణంగా పట్టణాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎక్కువగా నివాసముంటారు. ఆ రెండు వర్గాలు ప్రభుత్వ బాధితులే. రాజకీయ ప్రత్యర్థులకు మించి అన్నట్లు వారితో ప్రభుత్వం వ్యవహరించింది.పైగా విద్యాధికులు ఎక్కువగా ఉంటారు. వారు సంక్షేమ పథకాల కంటే అభివృద్ధిని స్వాగతిస్తారు. మరోవైపు వైసీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో పన్నులను పెంచింది. చార్జీల పెంపు ప్రభావం కూడా అధికంగా ఉంటుంది. బాహటంగానే ప్రభుత్వ తీరును తప్పుపడుతుంటారు. ఈ తరుణంలో అర్బన్ ఓటర్లు తీరుపై అధికార పార్టీలోనే అనుమానాలున్నాయి. అందుకే గ్రామాల్లోనే పట్టు పెంచుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వంపై అర్బన్ ఓటర్లు ఆగ్రహంగా ఉన్న నేపథ్యంలో వారిని తమ వైపు తిప్పుకునేందుకు కూటమి అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఎన్నికల్లో అర్బన్ ఓటర్లు ఎవరి వైపు మొగ్గుచూపుతారో చూడాలి.

తొలిపింఛనర్

ఎన్టీఆర్ హయాంలోనే పింఛన్..



ఎన్టీ రామారావు సీఎంగా ఉన్న సమయంలో వృద్ధులకు రూ.75తో పింఛన్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నేను పింఛన్ అందుకుంటున్నా. రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన రూ.200, చంద్రబాబునాయుడు ఇచ్చిన రూ.2వేలు పింఛను అందుకున్నా. ప్రస్తుతం రూ.3 వేలు అందుకుంటున్నా. చంద్రబాబునాయుడు ప్రకటించిన రూ.4వేలు పింఛన్ కూడా అందుకుంటా.

- వరహాలమ్మ(98 ఏళ్లు), చీమలవలస, ఆమదాలవలస మండలం

మీకు తెలుసా?

ఏ-ఫారం అంటే..



గార: ఎన్నికల సమయంలో ఏ, బీ ఫారాల గురించి ఎక్కువగా వింటాం. అసలు అవి ఎందుకు, ఎలా వినియోగిస్తారో చాలామందికి తెలియదు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులను పోటీలో ఉండే అభ్యర్థులకు కేటాయించాలంటే ఈ రెండు అవసరం. ఏ-ఫారాన్ని గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు ఓ అభ్యర్థిని ఎంపికచేసి ఆయనకు అందజేస్తారు. ఆయనకు మాత్రమే మిగిలిన అభ్యర్థులకు బీ-ఫారాన్ని అందించే అర్హత ఉంటుంది. ఏ-ఫారం అందుకున్న వ్యక్తి తనకు లభించిన ఫారాన్ని ముందుగా ఎన్నికల అధికారికి అందజేస్తారు. అందులో తమ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల వివరాలను పొందుపరుస్తారు. ఈ ఫారం మీద పార్టీ అధ్యక్షుడు లేదా ప్రధాన కార్యదర్శి సంతకం, పార్టీ ముద్ర ఉంటుంది.

బీ-ఫారం అంటే..

గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వీరే అంటూ పార్టీ ప్రతినిధి (ఏ-ఫారం కలిగి ఉన్నవ్యక్తి) ఇచ్చేది బీ-ఫారం. నామినేషన్ సమయంలో ఎన్నికల అధికారికి అభ్యర్థి బీ-ఫారం అందజేస్తారు. ఇది ఉంటే ఆ అభ్యర్థిని రాజకీయ పార్టీ తమ అభ్యర్థిగా పోటీ చేయిస్తున్నట్లు లెక్క. ఇది ఉంటేనే పార్టీకి సంబంధించిన గుర్తును ఆ అభ్యర్థికి కేటాయిస్తారు. ఎన్నికల్లో ఆ గుర్తుతోనే ప్రచారం చేస్తారు. బీ-ఫారం ఇవ్వకపోతే ఎన్నికల సంఘం స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది.

శబ్దం మోతాదు మించితే కేసు



శృతిమించారో..

హిరమండలం: ప్రస్తుతం అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తోన్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి వివిధ రూపాల్లో ప్రచార ఉధృతి పెంచారు. పెద్ద శబ్ధాలతో ప్రచార సాధనాల ద్వారా తమ హామీలను వివరిస్తున్నారు. ఈ శబ్ధాలు శృతిమించడంతో సామాన్యులకు అవస్థలు తప్పడంలేదు. ఈనేపథ్యంలో చట్టపరంగా నిర్దేశిత ప్రాంతాల్లో ఏ మేరకు ధ్వని వినియోగించాలో ప్రత్యేక నిబంధనలకు ఈసీ రూపకల్పన చేసింది. నివాస ప్రాంతాల్లో 45-55 డెసిబుల్స్ దాటరాదు. వైద్యశాలలు, విద్యాలయాలు, న్యాయస్థానాల సమీపంలో 40-50 డెసిబుల్స్, వ్యాపార ప్రాంతాల్లో 55-65, పారిశ్రామిక ప్రాంతంలో 70-75 డెసిబుల్స్ ఉండాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు తీవ్రతను బట్టి జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది. అందుకే అభ్యర్థులు, ప్రచారకర్తలు అప్రమత్తంగా ఉండాలి.

ఓల్డ్ ఈజ్ గోల్డ్

రిక్షా... మైకు... ఓ గుర్తు!



శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి: ఎన్నికలు వస్తే పల్లెల్లో సందడి అంతాఇంతా కాదు. ఇప్పుడైతే రకరకాల ప్రచార సాధనాలు వచ్చాయి గానీ... ఒకప్పుడు... అంటే దాదాపు నాలుగు దశాబ్దాల కిందట ప్రధాన ప్రచార వాహనం రిక్షానే. జనతా పార్టీ... జాతీయ కాంగ్రెస్, కాంగ్రెస్ ఎస్ తదితర జాతీయ పార్టీల అభ్యర్థులు బరిలో ఉండేవారు. అప్పట్లో రిక్షాలపై మైక్‌లతో ప్రచారం చేసేవారు. 'ఆవుదూడకే మన ఓటు... హస్తం గుర్తుకే మీ ఓటు... రాట్నం గుర్తుకే మన ఓటు... నాగలి పట్టిన రైతు గుర్తుకే మన ఓటు...' అంటూ ప్రచారం చేసేవారు. ఈ ప్రచారం ఎక్కువగా రిక్షాలపై సాగేది. రిక్షాలకు పోస్టర్లు అతికించి...ఓ వ్యక్తి వాటిలో కూర్చొని... మైకులో ప్రచారం చేసేవారు. అప్పట్లో జీపులపైనే అభ్యర్థులు ప్రచారానికి ఊరూరా తిరిగేవారు. జీపుల్లో ప్రచారానికి అభ్యర్థులు వస్తే వారి వెంట పిల్లలు పరుగులు పెట్టేవారు.

ఓటరు గుర్తింపు కార్డుకు 29 ఏళ్లు

మీకు తెలుసా?



నరసన్నపేట: దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు స్వయం ప్రతిపత్తితో కూడిన ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకువస్తోంది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశం కావడంతో ఎన్నికల నిర్వహణ సంక్లిష్టంగా ఉంటుంది. ఈనేపథ్యంతో ప్రతిఓటరును గుర్తించేందుకు, దొంగఓట్లను అరికట్టేందుకు 1995లో అప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టారు. ఈ గుర్తింపు కార్డులు అమలులోకి వచ్చి 29 సంవత్స రాలు పూర్తయ్యింది. ఓటరు జాబితాల్లో ఉన్న క్రమ సంఖ్య ప్రకారం ఫొటోను కార్డుపై ముద్రించి ఇస్తున్నారు. ఐడీ కార్డుపై పాస్‌పోర్టు సైజు ఫొటో, జనన తేదీ, చిరునామ సైతం ముద్రిస్తారు. సీరియల్ నంబరు, హోలోగ్రామస్టిక్కర్, కార్డును జారీచేసిన అధికారి స్టాంపు, సంతకం కూడా ఉంటా యి. దీనిపై ముద్రించిన సీరియల్ నంబరు చాలాముఖ్యం. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా డేటాను ఆన్‌లైన్‌లో ఉంచ డంతో ఓటరు ఎన్నికల సంఖ్య, సీరియల్ నంబర్‌ను సులభం గా తెలుసుకుంటున్నారు. వీటి స్థానంలో మారుతున్న సాం కేతిక పరిజ్ఞానం వినియోగించి ఎన్నికల సంఘం ప్రతి ఓట రు ఒక గుర్తింపు నెంబరుతో ఎపిక్ కార్డును ప్రస్తుతం జారీ చేస్తోంది. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈ కార్డు అందజే స్తున్నారు. దీనిని ఇతర ప్రభుత్వ పథకాలను పొందేందుకు , భారతీయ పౌరుడిగా గుర్తింపు కోసం, చిరునామ కోసం అధికారంగా వినియోగించుకోవచ్చు.

స్థల వివాదంలో వైద్యుడిపై దాడి

● కారును ధ్వంసం చేసిన దుండగులు


ధ్వంసమైన వైద్యుడి కారు

టెక్కలి, ఏప్రిల్ 21: టెక్కలి-తెంబూరు హైవే రోడ్డు వంతెన అప్రోచ్ రోడ్డు సమీపంలో ఓ స్థల విషయంలో డాక్టర్ రాజేష్‌పై పలువురు వ్యక్తులు దాడి చేసి ఆయన కారును ధ్వంసం చేసి కారులో ఉన్న సుమారు రూ.లక్ష నగదు, ఆ స్థలానికి సంబంధించిన పత్రాలను పట్టుకు పోయిన ఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. సదరు ప్రాంతంలో భవిష్యత్‌లో క్లినిక్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇటీవల డాక్టర్ రాజేష్ కొనుగోలు చేశారు. ఆ స్థలం మాదంటూ కొందరు వ్యక్తులు మూడు రోజులుగా అడ్డుపడుతూ అక్కడ పిల్లర్లతో వేసిన కంచెను సైతం తొలగించేశారు. దీంతో ఈ విషయమై డాక్టర్ రాజేష్ టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని అతని వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి పనులను నిలిపివేశారు. శనివారం రాత్రి 8.30 గంటల తరువాత రాజేష్ తన అనుచరుడు శ్రావణ్‌తో కలిసి ఆ స్థలం వద్దకు కారుతో వెళ్లగా అప్పటికే మాటు వేసిన వ్యక్తులు కారు అద్దాలు ధ్వంసం చేస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేసి పిడి గుద్దులు గుద్దారు. దీంతో వారు సమీపంలో ఓ ఇంటికి వెళ్లి తలదాచుకుని వెంటనే టెక్కలి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ వారణాసి వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని డాక్టర్ రాజేష్, గాయపడిన శ్రావణ్‌లను పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. ఈ స్థలం వ్యవహారంలో చింతాడ జోగారావు, బగాది రామన్న, ఎండ ధనుంజయరావు, ఎండ సింహాచలం తదితరులు తనపై తన అనుచరుడిపై దాడికి పాల్పడ్డారని రాజేష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ షైడయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే వైద్యుడిపై దాడి చేసిన చింతాడ జోగారావు వైసీపీకి చెందిన ముఖ్య నాయకుడి సోదరుడు కావడం చర్చనీయాంశమైంది.

విశాఖ-బి కాలనీలో 7 తులాల బంగారం చోరీ

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలంలో ఓ ఇంట్లో దొంగలు పడి 7 తులాల బంగారం చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ వాసుదేవరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విశాఖ-బి కాలనీలో గుడ్ల శేషగిరిరావు తన భార్యతో కలిసి ఉంటున్నారు. అయితే మూడంతస్తుల బిల్డింగ్‌లో మొదటి అంతస్తు అద్దెకు ఇచ్చి ప్రతీరోజు రాత్రి సమయంలో పెంట్‌హౌస్‌లో నిద్రిస్తుండేవారు. వీరికి ఇద్దరు పిల్లలు కాగా వివాహమై అమెరికాలో ఉంటున్నారు. శనివారం రాత్రి కూడా శేషగిరిరావు అతని భార్య పెంట్‌హౌస్‌లో నిద్రించగా కింద ఇంట్లో దొంగలు చొరబడ్డారు. బీరువాపై ఉన్న తాళాలతో సులువుగా బీరువా తెరిచి లాకర్‌పై ఉన్న తాళాల సాయంతో లాకర్ తెరిచి అందులో ఉన్న 7 తులాల బంగారం చోరీ చేసి పరారయ్యారు. ఆదివారం ఉదయం ఎప్పటిలాగే శేషగిరిరావు కింద ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని తెలుసుకుని రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాశినాయుడు, ఎస్ఐ వాసుదేవరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్ఐ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంపంపై పడి యువకుడికి తీవ్ర గాయాలు

మెళియాపుట్టి: మెళియాపుట్టి గ్రామానికి చెందిన జగదీశ్వరరావు ఆచారి ఆదివారం ఉదయం వడ్రంగి పనులు చేస్తూ స్పృహ కోల్పోయి రంపంపై పడడంతో తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగదీశ్వరరావు తండ్రి మోహనరావుతో కలిసి వడ్రంగి చేస్తుంటాడు. యథావిధిగా పని చేస్తుండగా ప్రమాదవశాత్తు రంపం పీకకు (కంఠం) తగిలి ఈ ప్రమాదం జరిగింది. అయితే సదరు వ్యక్తి డిగ్రీ వరకు చదువుకుని కొన్నాళ్లు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో పనిచేస్తుండేవాడు. ఆరోగ్యం బాగులేకపోవడంతో ఇంటికి వచ్చి తండ్రితో ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. గత కొన్నాళ్ల నుంచి మానసికస్థితి బాగులేక పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. అయితే ఏం జరిగిందో తెలియదు గాని ఆదివారం పీక వద్ద గాయం కావడాన్ని కుటుంబ సభ్యులు గమనించి వెంటనే 108లో టెక్కలి ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి నేరాలు జరగకుండా, వాటిని నియంత్రించేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు కాశీబుగ్గ డీస్పీ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం బెల్లుపడ గ్రామంలోని 12, 13, 14 వార్డుల్లో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఎటువంటి పత్రాలు లేని 12 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్, కవిటి ఎస్ఐలు వి.సత్యనారాయణ, లక్ష్మణరావు, రాము, సిబ్బంది పాల్గొన్నారు. ● **సరుబుజ్జిలి:** కొత్తకోట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ద్విచక్ర వాహనాల ధ్రువ పత్రాలను పరిశీలించారు. ఎటువంటి పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నిహార్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలు కొనేటప్పుడు వాహనాలకు సంబంధించిన పత్రాలన్నీ సరిచూసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వవద్దన్నారు. ఏఎస్ఐ చంద్రి నాయుడు, హెచ్‌సీ రవిశంకర్ పాల్గొన్నారు. ● **జలుమూరు (సారవకోట):** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎటువంటి రికార్డులు లేని 11 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు నేతృత్వంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి: ఇద్దరికి గాయాలు

హరిపురం: బాలిగాం జాతీయరహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కవిటి మండలం దూగానపుట్టుగకి చెందిన బల్ల జోగారావు (52), బంధువులు శేషమ్మ (42), జస్వంత్(9)తో కలిసి ద్విచక్ర వాహనంపై వజ్రపుకొత్తూరు మండలం ధర్మపురంలో జరిగిన శుభ కార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా బాలిగాం వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో జోగారావు అక్కడికక్కడే మృతిచెందగా శేషమ్మ, జస్వంత్ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు హరిపురం ఆసుపత్రికి తరలించి చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం జీజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంతో వ్యక్తి మృతి

హిరమండలం: మండలంలోని భగీరథపురం-బొంతు మార్గంలో కోదూరు గ్రామం సమీపంలో శనివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పిన ఘటనలో దాసుపురానికి చెందిన సిద్ధమడుగుల శంకరరావు(26) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శంకరరావు గ్లాస్ ఫిట్టింగ్ వర్క్ చేస్తుంటాడు. భార్య ఆశ గర్భవతి కావడంతో 15 రోజుల నుంచి సవితిసీదిలో కన్నవారింట్లోనే ఉంటోంది. శంకరరావు ఎప్పటిలాగే పని ముగించుకుని శనివారం అత్తవారింటికి వెళ్లాడు. అక్కడి నుంచి సోదరి గ్రామం కోదూరు వెళ్లి తిరుగు ప్రయాణంలో రాత్రి 12 గంటల సమయంలో బైక్ అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. తలకి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి వివాహమై రెండేళ్ల మాత్రమే అయింది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నారాయణ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్నుల పండువగా పండిత సదస్యం

● వైజయంతి రథంపై స్వామి తిరువీధి ఉత్సవం

అరసవల్లి, ఏప్రిల్ 21: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సదస్యం, వేద పండితుల మహదాశీర్వచనం తదితర కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో పలువురు పండితులు సూర్య భగవానుని కీర్తిస్తూ తమ రచనలను చదివారు. అలాగే వేద పండితులు మహదాశీర్వచనం చేశారు. అనంతరం స్వామికి విశేష పూజలు, హారతి నిర్వహించారు. పండితులను అర్చకులు సత్కరించారు. కార్యక్రమంలో ఈవో ఎస్.చంద్రశేఖర్, పలువురు పండితులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్వామిని దేవదాయ శాఖ ఏసీ (విజయవాడ) టి.చంద్రకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అలాగే సినీహీరో ఆకాశ్ పూరి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరిని అర్చకులు ఆశీర్వదించారు.

వైభవంగా తిరువీధి

సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తిరువీధి నిర్వహించారు. ఉత్సవ మూర్తులను వైజయంతి రథంపై వేంచేపు చేసి వేదపఠనం, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాలతో వైజయంతి రథంపై తిరువీధి నిర్వహించారు. అనంతరం నిత్యోపాసన, విశేష పూజ, మంగళహారతి ఇచ్చారు. అరసవల్లి, నరసన్న పేటకు చెందిన కళాకారులు కోలాట ప్రదర్శన చేపట్టారు.

ఆదాయం రూ.2.98 లక్షలు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి ఆదివారం ఒక్కరోజు రూ.2,98,148 ఆదాయం వచ్చింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.1,49,000, విరాళాల ద్వారా రూ.59,083, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.90,065 ఆదాయం వచ్చినట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.



మహదాశీర్వచనంలో పాల్గొన్న పండితులు, అర్చకులు, దేవదాయశాఖ అధికారులు

కూటమి విజయంతోనే సంక్షేమం సాధ్యం


అరసవల్లి: ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల సతీమణులు శ్రావ్య, స్వాతి

అరసవల్లి: రాష్ట్రంలో కూటమి విజయంతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు సతీమణి శ్రీశ్రావ్య, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతి అన్నారు. ఆదివారం నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఇన్‌చార్జిలు ముద్దాడ రామకృష్ణ, ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా గొండు శంకర్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు విభూది సూరిబాబు, సింతు సుధాకర్, తమ్మినేని సుజాత, కోరాడ రమేష్, తదితరులు పాల్గొన్నారు. ● **గార:** గార మండలం బూరవెల్లి గ్రామంలో ఆదివారం రాత్రి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి గొండు శంకర్ తరపున ఆయన సతీమణి స్వాతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా శంకర్, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ నాయకులు మళ్ల అబ్బాయినాయుడు, నరసింగరావు, పండి యోగీశ్వరరావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పై విస్తృత ప్రచారం


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి నీలోత్పల

కంచిలి: అంపురం పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పెద్ద అంపురం, నరసన్నముకుందపురం, పద్మతుల గ్రామాల్లో పర్యటించి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, కూటమి నేతలు లోళ్ల రాజేష్, బంగారు కురయ్య, మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, జి.మన్మథరావు, సదానంద రౌళో తదితరులు పాల్గొన్నారు.

కూటమిని గెలిపించండి: ఎన్ఈఆర్


ఎన్ఈఆర్ సమక్షంలో టీడీపీ గూటికి చేరిన ఇబ్రహీంబాద్ ఎంపీటీసీ సభ్యుడు సూర వెంకన్న

రణస్థలం: అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమ ప్రాధాన్యం ఇచ్చే కూటమిని గెలిపించాలని ఎచ్చెర్ల నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. దోమాం, పూడివలస, కేశవరావుపేట తదితర గ్రామాల్లో ఆదివారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా అడుగంటి పోయిందన్నారు.

ఇబ్రహీంబాద్ ఎంపీటీసీ మద్దతు

రణస్థలం: ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావుకు ఇబ్రహీం బాద్ ఎంపీటీసీ సభ్యుడు సూర వెంకన్న మద్దతు తెలిపారు. టీడీపీ తరపున విజయం సాధించి ఇంతవరకు వైసీపీకి అనుకూలంగా ఉన్న ఆయన ఆదివారం తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఈశ్వరరావు సమక్షంలో అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణు గోపాలం, నేతలు బెండి మల్లేశ్వరరరావు, పొందూరు భీమారావు, బచ్చు కోటిరెడ్డి, గొలివి గోవిందరావు, రణస్థలం మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఫామ్ అందుకున్న కలిశెట్టి

రణస్థలం: టీడీపీ ఉమ్మడి పార్టీల మద్దతుతో టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆదివారం బీఫామ్ అందుకున్నారు. ఉండవల్లిలో జరిగిన కార్యాలయంలో కలిశెట్టితో కొద్దిసేపు ముచ్చటించి, విజయనగరం పార్లమెంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మోడల్ పాఠశాలల్లో చేరికకు పరీక్ష

బూర్జ/పొందూరు/జలుమూరు/పోలాకి: జిల్లాలోని పలు మోడల్ పాఠశాలల్లో ఆరోతరగతి ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఓవీపేట పాఠశాలలో 272 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. వావిలపేట మోడల్‌లో 250 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకరరావు పేర్కొన్నారు. కరవంజ ఆదర్శ పాఠశాలలో పరీక్షకు 271 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్ తెలిపారు. ఈదులవలస ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పరీక్షలకు 353 మంది హాజరయ్యారని ఎస్‌వో పైడి ప్రవీణ పేర్కొన్నారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన

శ్రీకాకుళం: నగరంలోని ఉమారుద్రకోటేశ్వర స్వామి వారి దేవాలయంలో ఆదివారం రాజరాజేశ్వరి అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. లలిత భక్త మండలి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామ మూర్తి, చంద్రశేఖర శర్మ పర్యవేక్షణలో సుమారు 300 మంది మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ పదవికి 'సాసుపల్లి' రాజీనామా

● సర్పంచ్ అక్రమాలపై డీపీవోకు ఫిర్యాదు

నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయతీలో సర్పంచ్ నియంతృత్వ ధారణితో కలత చెంది ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు 17వ వార్డు సాసుపల్లి కృష్ణబాబు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు సేవలందించాలని ఆశించానని, అయితే మేజర్ పంచాయతీలో ఆక్రమణలు, అవినీతితో పంచాయతీ నిధులు దుర్వినియోగమవుతున్నాయన్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించి ఇద్దరు కాంట్రాక్టు సిబ్బందితో ఈవో, సర్పంచ్ దోపిడీకి పాల్పడుతున్నారని, నూతన వాణిజ్య భవనాలకు ఇంటి పన్నులు తక్కువ మొత్తంలో వేసేందుకు గాను సదరు లబ్ధిదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని డీపీవోకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ సామగ్రి, బ్లీచింగ్, పొడిసున్నం, పీడబ్ల్యూఎస్ సామగ్రి, ఇతర నిర్వహణ సామగ్రి కొనుగోలులోను అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరుతూ డీపీవోకు ఫిర్యాదు చేసినట్లు కృష్ణబాబు తెలిపారు.

వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

ఆమదాలవలస: పట్టణంలో వి.జగ్గునాయుడి అనే వ్యక్తిపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ట్రాఫిక్ విషయంలో నాయుడికి ఓ బస్సు డ్రైవర్‌కు మధ్య వివాదం తలెత్తగా ఈ విషయంలో మరో ప్రయాణికుడు కలుగజేసుకుని ముందుగా ఫోన్ ద్వారా తన అనుచరులకు తెలపడంతో ఆమదాలవలస వన్ వే జంక్షన్‌కు బస్సు చేరుకోగానే గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు అతడిపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. జగ్గునాయుడిని ఆమదాలవలస ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం పంపించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.



నామినేషన్‌ను విజయవంతం చేయండి: అచ్చెన్న

టెక్కలి: టెక్కలి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా సోమవారం తాను నామినేషన్ వేయనున్నానని, టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యనేతలు, కార్యకర్తలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 9 గంటలకు నామినేషన్ వేస్తానని, 50 వేల మందితో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామన్నారు. కోటబొమ్మాళి కొత్త మ్మ తల్లి ఆలయం వద్ద ఉదయం 7 గంటలకు పూజలు చేసిన అనంతరం టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్‌కు చేరుకొని అక్కడి నుంచి ఊరేగింపుగా టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వనామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. తనతో పాటు ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, బీజేపీ, జనసేన ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. మూడు పార్టీల క్యాడర్ క్రమశిక్షణతో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్ కుమార్, బోయిన రమేష్, జీరు భీమారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 20 వైసీపీ కుటుంబాలు చేరిక

టెక్కలి: కోటబొమ్మాళి మండలం కస్పీవలస పంచాయతీ నుంచి 20 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరాయి. వీరికి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు సోదరుడు కింజరాపు హరిప్రసాద్ కండువాలు వేసి ఆహ్వానించారు. అచ్చెన్నాయుడు నాయకత్వంలో తామంతా పనిచేస్తామని, ఆయనతోనే అభివృద్ధి సాధ్యమని వారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి, వెలమల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● **ఆమదాలవలస:** పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో 12వ వార్డు లక్ష్మీనగర్ వీధికి చెందిన టీడీపీ నాయకురాలు బోయిన సునీత ఆధ్వర్యంలో సంకు శరత్ మరో 50 మంది యువకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి పొందూరు మాజీ ఎంపీపీ కూన ప్రమీల కండువాలు వేసి ఆహ్వానించారు.

శిరీష విజయానికి కృషి


మాట్లాడుతున్న లొడగల కామేశ్వరరావు

పలాస: టీడీపీ గౌతు శిరీష విజయం కోసం కృషి చేస్తామని పలాస నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంఘం నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. గౌతు శిరీష గెలుపుతోనే పలాస అభివృద్ధి చెందుతుందని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు దాసరి తాతారావు, కిక్కర ఢిల్లీరావు, కొర్రాయి బాలకృష్ణయాదవ్, సప్ప నవీన్, వంకల కూర్మారావు, మన్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

బూర్జ: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్ అన్నారు. నీలాదేవిపురం, కాఖండ్యాం, మామిడివలస, పెద్దలంకాం గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కూన రవికుమార్, ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎం.రాము, కోడి గోవింద రావు, ప్రభాకరరావు, సీతబాబు, జగన్నాథ నాయుడు, అప్పలనాయుడు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభాస్థలిని పరిశీలించిన ఎస్పీ

టెక్కలి: సీఎం జగన్ ఈనెల 24 టెక్కలిలో సిద్ధం ముగింపు సభకు రానున్న నేపథ్యంలో హైవే అక్కవరం సమీపంలో సభా ప్రాంతాన్ని ఎస్పీ జీఆర్ రాధిక ఆదివారం పరిశీలించారు. ముగింపు సభకు పెద్దఎత్తున జనసేకరణ చేయనున్న నేపథ్యంలో బందోబస్తుపై సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ షైడయ్య, ఎస్ఐ లక్ష్మి తదితరులున్నారు.

జగన్ పర్యటన విజయవంతం చేయండి

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర సందర్భంగా ఈ నెల 24న సీఎం జగన్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో కోరారు. 23 రాత్రికి జగన్ ఎచ్చెర్ల చేరకుని అక్కడే బస చేస్తారన్నారు. 24న శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల మీదుగా బస్సు యాత్ర టెక్కలికి చేరుకుని ప్రచార సభలో పాల్గొని యాత్ర ముగిస్తారన్నారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

పొందూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ మద్యం, నగదు అక్రమ రవాణా సాగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని విధిగా తనిఖీ చేయాలని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అధికారులను ఆదేశించారు. ఆదివారం రాపాక వద్ద చెక్‌పోస్టును పరిశీలించారు. రాత్రి వేళలో గస్తీ పెంచాలన్నారు.

శంఖారావం విజయవంతం చేయాలి

పాతపట్నం: పాతపట్నంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చేపట్టనున్న ఎన్నికల శంఖారావం కార్యక్రమానికి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పైల బాబ్జీ కోరారు. ఈ మేరకు ఆదివారం రోడ్‌షో ప్రాంతాలను పరిశీలించారు. చంద్ర బాబు రోడ్‌షోకు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ లీకేజీ



సోంపేట: పలాసపురం పంచాయతీలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి 15 రోజులుగా నీరు లీకవుతోంది. దీంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాజాం వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల మండలం, కింతలిమిల్లు గ్రామ కాపురస్తురాలైన **శ్రీమతి కొత్తకోట లక్ష్మి W/o రాము** నా క్లయింటు సంస్థ నుండి తీసుకొనబోవు ఋణమునకు హామీగా ఆమె స్వాధీన, హక్కు అనుభవములోనున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించియున్నారు. కావున సదరాస్తిపై వేరే ఎవరికయినా ఎట్టి హక్కుగాని, ఆసక్తిగాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రచురింపబడిన ఏడు దినములలోగా వారి యొక్క అక్షేపణలను నాకుగాని, నా క్లయింటుకుగాని తెలియపరచవలెను. లేని యెడల సదరాస్తిపైగాని, దానిపై జరవబోవు తాకట్టుపైగాని ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని భావింపబడునని యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.
1వ ప్రతి: షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల మండలం, సంతసీతారామపురం పరిధిలో గల సర్వేనెం. 214లో గల తూ.ప.లకు 30అ॥, ఉ.ద.లకు 40అ॥ మొత్తం 133.333చ॥గ॥ గల ఖాళీస్థలమునకు **హద్దులు: ఉ:** ప్లాట్‌నెం. 1426రు, ద: 24అ॥ వెడల్పు గల లే-అవుట్ రోడ్డు, **తూ:** ప్లాట్‌నెం. 1433రు, **ప:** ప్లాట్‌నెం. 1431రు.
2వ ప్రతి: షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, పొందూరు సబ్-డి, ఎచ్చెర్ల మండలం, సంతసీతారామపురం గ్రామపంచాయితీ, సంతసీతారామపురం గ్రామ లెక్క దాఖలలో చేరనటువంటి సర్వేనెం. 214లో చేరినట్టి సాయిబృందావనం లే-అవుట్ ప్లాట్‌నెం.1430రు, ప్లాట్‌నెం. 1457రు గల ఖాళీస్థలమునకు కొలతలు: తూ.ప.లకు 30అ॥, ఉ.ద.లకు 40అ॥ మొత్తం 133.333చ॥గ॥ గల ఖాళీస్థలమునకు **హద్దులు: ఉ:** ప్లాట్‌నెం. 1428రు, ద: 24అ॥ వెడల్పు గల లే-అవుట్ రోడ్డు, **తూ:** ప్లాట్‌నెం. 1431రు, **ప:** ప్లాట్‌నెం. 1429రు.
3వ ప్రతి: షెడ్యూలు: ప్లాట్‌నెం.1457 గల ఖాళీస్థలమునకు కొలతలు: తూ.ప.లకు 30అ॥, ఉ.ద.లకు 60అ॥ మొత్తం 200చ॥గ॥ గల ఖాళీస్థలమునకు **హద్దులు: ఉ:** ప్లాట్‌నెం. 1447రు, ద: 24అ॥ వెడల్పు గల లే-అవుట్ రోడ్డు, **తూ:** ప్లాట్‌నెం. 1456రు, **ప:** ప్లాట్‌నెం. 1457రు.
టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759




పెళ్లింట విషాదం

● విద్యుదాఘాతంతో మహిళ మృతి
● 12 మందికి గాయాలు

రణస్థలం: రణస్థలం మండలం అల్లివలసలో జరిగిన ఓ పెళ్లి వేడుకలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో ఒక మహిళ మృతి చెందగా మరో 12 మంది గాయపడ్డారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అల్లివలస గ్రామంలో మైలిపిల్లి లక్ష్మడు కుమారుడికి ఆదివారం రాత్రి పెళ్లి నిశ్చయించారు. ఈ మేరకు వధూవరులను పీటలపై కూర్చోబెట్టిన తర్వాత తంతులన్నీ నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు వివాహ వేడుకల్లో నిమగ్నమయ్యారు. అయితే మరో పది నిమిషాల్లో పెళ్లికొడుకు తాళి కడతాడన్న సమయానికి పురోహితుడు పట్టుకున్న మైక్‌కు ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో అక్కడే ఉన్న పెళ్లి కుమారుడు బంధువు జీడిపాలెంకు చెందిన సీతమ్మ(48) షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పురోహితుడు వెంకట రమణతో పాటు పెళ్లి కుమారుడు తండ్రి లక్ష్మడు, సూరాడ రవణమ్మ, ఎం. రేవంత్, ఎం. లక్ష్మి, ఎస్.చిల కమ్మ, జి. ఎల్లమ్మ, జి.లక్ష్మి మరికొందరు విద్యుదాఘాతానికి గురయ్యారు. వారిని హుటాహుటిన ఆటోల్లో రణస్థలంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారందరికీ వైద్యులు చికిత్స అందిస్తు న్నారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు


మృతి చెందిన సీతమ్మ


రోదిస్తున్న కుటుంబ సభ్యులు



